విశాఖ బీచ్ రోడ్డులో ఘోర రోడ్డు ప్రమాదం..

– ఆగి ఉన్న వాహనాలపైకి దూసుకెళ్లిన కారు, ముగ్గురికి గాయాలు



విజయవాడ , అక్టోబర్24(నేటి మనదేశమ్ ప్రతినిధి) : విశాఖపట్నం బీచ్ రోడ్డులో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఓ కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఆగి ఉన్న వాహనాలపైకి దూసుకెళ్లిన ఘటనలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల ప్రకారం.. బిర్యానీ కొనుగోలు చేసేందుకు కొందరు వాహనదారులు తమ వాహనాలను రోడ్డు పక్కన నిలిపివేశారు. అదే సమయంలో వేగంగా వచ్చిన ఒక కారు అచూకీ కోల్పోయి అకస్మాత్తుగా వాటిని ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో ఒక ఆటో, రెండు బైక్‌లు నుజ్జునుజ్జయంగా ధ్వంసమయ్యాయి. ఘటన సమయంలో ఒక్కసారిగా గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. స్థానికుల సమాచారం మేరకు వెంటనే స్పందించిన పోలీసులు, క్షతగాత్రులను మెరుగైన చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు (ఖ+ఽ) తరలించారు.కారు అతివేగమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమా లేదా సాంకేతిక లోపమా అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రద్దీగా ఉండే బీచ్ రోడ్డు ప్రాంతాల్లో వాహనదారులు మరింత అప్రమత్తంగా ఉండాలని ఈ ఘటన హెచ్చరిస్తోంది.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో సైబర్ కేటుగాళ్ల దుశ్చర్య.. కలెక్టర్ల పేరిటే వాట్సాప్ మోసాలు!

విజయవాడ , అక్టోబర్24(నేటి మనదేశమ్ ప్రతినిధి) : ఉమ్మడి కర్నూలు జిల్లాలో సైబర్ నేరగాళ్లు హద్దుమీరారు. ఎన్నికల విధుల్లో బిజీగా ఉన్న కర్నూలు కలెక్టర్ డాక్టర్ సిరి, నంద్యాల కలెక్టర్ రాజకుమారిల పేర్లు, ఫొటోలను వాట్సాప్ ప్రొఫైల్స్‌గా వాడుకుంటూ కేటుగాళ్లు మోసాలకు తెరతీశారు. గుర్తుతెలియని నంబర్ల నుంచి అధికారుల పరిచయస్తులకు మెసేజ్‌లు పంపి, అత్యవసరంగా రూ. 30,000 కావాలంటూ డబ్బులు డిమాండ్ చేశారు.ఈ విషయం తెలుసుకున్న ఇద్దరు కలెక్టర్లు వెంటనే అప్రమత్తమై, తాము ఎలాంటి డబ్బులు అడగలేదని స్పష్టం చేస్తూ ప్రజలను హెచ్చరించారు. ఐఏఎస్ అధికారుల పేర్లనే వాడుకుని సైబర్ మోసాలకు పాల్పడుతుండటంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ ఘటన సంచలనంగా మారింది. ఉన్నతాధికారులకే రక్షణ కరవైతే సామాన్యుల పరిస్థితి ఏంటని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి, టెక్నికల్ విభాగాన్ని ఆశ్రయించారు. నకిలీ సందేశాలు పంపిన ఆ నంబర్ల ఆధారంగా నిందితులను పట్టుకునేందుకు దర్యాప్తును వేగవంతం చేశారు. ఇలాంటి మోసాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

కోవూరులో భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన డీఎస్పీ



కోవూరు అక్టోబర్24(నేటి మనదేశమ్ ప్రతినిధి) : నెల్లూరు జిల్లా కోవూరులో మూడో రోజు నామినేషన్ల ప్రక్రియ కొన సాగుతోంది. ఈ నేపథ్యంలో పోలీసులు పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో శుక్రవారం స్థానిక నామినేషన్ కేంద్రాన్ని డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసులురెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.?కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను ఆయన స్వయంగా తనిఖీ చేశారు. నామినేషన్ల ప్రక్రియ ముగిసే వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పోలీసులను ఆదేశించారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ.. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులు ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో తమ నామినేషన్లను వేయవచ్చని చెప్పారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తే అనారోగ్య సమస్యలు దూరం



శిరివెళ్ల అక్టోబర్24(నేటి మనదేశమ్ ప్రతినిధి) : గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రతి ఒక్క కుటుంబం వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తే అనారోగ్య సమస్యలు దరిచేరవని మహానంది వ్యవసాయ కళాశాల అసోషియేట్ డీన్ డా. చావన్ శ్యామ్ రాజ్‌నాయక్ పేర్కొన్నారు. మండలం లోని గంగవరం గ్రామంలో జాతీయ సేవ పథకం ప్రత్యేక శిబిరం కార్యక్రమంలో భాగంగా.. కళాశాల విద్యార్థులు, కళాశాల అధ్యాపక బృందంతో కలిసి అసోషియేట్ డీన్ శుక్రవారం గ్రామస్థులకు పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రతంగా ఉంచుకోవడం ద్వారా అనారోగ్య రహితంగా ఉండవచ్చన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని సూచించారు. వ్యవసాయంలో రైతులు రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించి వాటిస్థానంలో సేంద్రీయ ఎరువుల వాడకాన్ని పెంచాలని, పంటలు సాగు చేసే ముందు రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు నిర్వహించి వాటి ఆధారంగా పంటసాగు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉమామహేశ్వరి, జ్యోత్స్న, కిరణ్మయి, గీత శిరీష, పవన్ కుమార్ పాల్గొన్నారు.

ఒకటవ డివిజన్ జనసేన అభ్యర్థి చరణ్ ముమ్మర ప్రచారం




మచిలీపట్నం అక్టోబర్24(నేటి మనదేశమ్ ప్రతినిధి) : మచిలీపట్నం నగర పాలక సంస్థ ఒకటవ డివిజన్‌లో యువనాయకుడు, విద్యావంతుడు, జనసేన పార్టీ అభ్యర్థి వంపుగడవల గీత్‌చరణ్ (వంపుగడవల చౌదరి కుమారుడు) పోటీ చేస్తూ తనదైన శైలిలో ఇంటింటికీ తిరిగి తనకు ఓటు వేసి ఆశీర్వదించవలసిందిగా కోరుతున్నారు. బీటెక్ చదివిన చరణ్ నగరాభివృద్ధికి కృషి చేయాలనే తలంపుతో పోటీచేస్తున్నట్లుగా తెలిపారు. తనను గెలిపిస్తే ఒకటవ డివిజన్‌ను అభివృద్ధి పథం వైపు పయనించేలా కృషిచేస్తానని హామీ ఇస్తున్నారు. డివిజన్‌లో పలు సమస్యలు పరిష్కరించవలసి ఉందని, ముఖ్యంగా డ్రైనేజీ పూడిక తీయడం, నూతన డ్రైన్ల నిర్మాణం, నూతన పైప్‌లైన్‌ల ఏర్పాటు చేయవలసి ఉందన్నారు. ప్రతి వీధికి సిసి రోడ్లు నిర్మించడం, తాగునీరు ఏర్పాటు చేయడం, సరైన సమయానికి అందరికీ స్వచ్ఛమైన మంచినీరు అందించడం, ఇళ్ల ముందు చెత్తా చెదారం నిల్వ లేకుండా చర్యలు తీసుకోవడం, డివిజన్‌లో ఉన్న పార్క్‌లో ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటు చేయడం, అవసరమైన చోట్ల సిమెంటు బెంచీల ఏర్పాటు, ఓపెన్ జిమ్ ఏర్పాటు, కాంతివంతమైన వీధిలైట్ల నిర్వహణ తదితర పనులు చిత్తశుద్ధితో చేపడతామని చరణ్ హామీ ఇచ్చారు. మహిళల, మహిళా సంఘాల ఆర్థిక భద్రతకు కృషిచేస్తానన్నారు. వంపుగడవల గీత్‌చరణ్ ఒకటవ డివిజన్‌ను సస్యశ్యామలంగా తీర్చిదిద్దుతానని చేస్తున్న ప్రచారం ఆకట్టుకుంటోంది. వీరి ప్రచార సరళి జనబాహుళ్యంలో చొచ్చుకుపోతోంది. అలాగే మేయర్ అభ్యర్థి అయిన షేక్ అబ్దుల్ అబీదాను కూడా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని, తాము గెలిచేలా ఆశీర్వదించాలని కోరారు. ఈ ప్రచారంలో వంపుగడవల చౌదరి, బత్తిన దాసు, రాజా హక్కుమహంతి, పిన్నింటి గణేష్, శీలం శశాంక్, శీలం నాయుడు, మాకాల ప్రసాద్, నరహరశెట్టి జగన్మోహనరావు, పల్లెం రాఘవరావు తదితరులు చరణ్‌తో కలిసి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి



విజయనగరం అక్టోబర్24(నేటి మనదేశమ్ ప్రతినిధి) : విజయనగరం మేయర్ అభ్యర్థిగా అవనాపు భార్గవి, కార్పొరేటర్లుగా పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు కోరారు. శుక్రవారం ఉల్లివీధిలో విజయనగరం వాణిజ్యమండలి ఆధ్వర్యంలో జరిగిన పరిచయ వేదికపై ఆమె మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం వ్యాపారస్థులకు అండగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని అదితి చెప్పారు. వ్యాపారులు, వారి కుటుంబాలు స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆమె విన్నవించారు. ఒకసారి మేయర్‌గా అవకాశం ఇస్తే వ్యాపార వర్గాలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని భార్గవి చెప్పారు. వ్యాపార వర్గాల ప్రతినిధులు కాపు గంటి శ్రీనివాస్, నిర్మల్ కుమార్ జైన్, తెదేపా నాయకులు అవనాపు విజయ్, కేదారిశెట్టి సీతారామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించాలని 'జబర్దస్త్ టీం' ఎన్నికల ప్రచారం



అనకాపల్లి అక్టోబర్24(నేటి మనదేశమ్ ప్రతినిధి) : అనకాపల్లిలో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ జబర్దస్త్ టీం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్నంలోని జీవీఎంసీ 112 వ వార్డులో జనసేన అభ్యర్థిని ఆళ్ల వైష్ణవి తరపున జబర్దస్త్ టీం రాజు, దొరబాబులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. విశాఖ మెయిన్ అభ్యర్థిని ముక్కా శ్రావణికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనకాపల్లి జీవీఎంసీ జోన్‌లోని ఆరు వార్డులు మహిళలకు కేటాయించారు.వార్డులోని ఆరుగురు కూటమి అభ్యర్థులకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. స్థానిక సమస్యలు ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

నర్సీపట్నం మరియు ఎలమంచిలి మున్సిపాలిటీలలో ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి

జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్



అనకాపల్లి అక్టోబర్24(నేటి మనదేశమ్ ప్రతినిధి) : అనకాపల్లి జిల్లాలోని ఎలమంచిలి మున్సిపాలిటీ మరియు నర్సీపట్నం మున్సిపాలిటీ ఎన్నికలు మొదట ఈ నెల 28వ తేదీన జరగాల్సి ఉండగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల ప్రకారం ఆ ఎన్నికలను వాయిదా వేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి విజయ కృష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం, పోలింగ్ ప్రక్రియ నవంబర్ 1వ తేదీన నిర్వహించబడుతుందని, అవసరమైతే రీపోలింగ్ నవంబర్ రెండవ తేదీన నిర్వహిస్తామని, ఓట్ల లెక్కింపు (కౌంటింగ్) ప్రక్రియ నవంబర్ 3వ తేదీన జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు.

ఎన్నికల ఫిర్యాదులపై ప్రత్యేక పోలీసు కంట్రోల్ రూమ్‌లు

ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా నేరుగా పోలీసులను సంప్రదించవచ్చు.

జిల్లా ఎస్పీ శ్రీ కె.వి. మహేశ్వర రెడ్డి ఐపీఎస్



శ్రీకాకుళం,అక్టోబర్24(నేటి మనదేశమ్ ప్రతినిధి) : ఎన్నికలకు సంబంధించిన ఎటువంటి ఫిర్యాదులు ఉన్న నేరుగా పోలీసులను సంప్రదించవచ్చు అని, ఆయా ఫిర్యాదులు స్వీకరించి, వాటిపై తక్షణ చర్యలు చేపట్టేందుకు జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రత్యేక పోలీసు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి శుక్రవారం నాడు ఒక ప్రకటన రూపంలో తెలిపారు. అదేవిధంగా శ్రీకాకుళం, టెక్కలి, కాశీబుగ్గ పోలీసు సబ్‌డివిజన్లలోని డీఎస్పీ కార్యాలయాల్లోనూ ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు, సమాచారాన్ని కింది నంబర్లకు తెలియజేయవచ్చు:
– జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్: 6309990933
– జిల్లా పోలీసు ఎన్నికల సెల్: 6309990923
– శ్రీకాకుళం డీఎస్పీ కార్యాలయం: 6309990804
– కాశీబుగ్గ డీఎస్పీ కార్యాలయం: 6309990805
– టెక్కలి డీఎస్పీ కార్యాలయం: 6309990811
ఎన్నికల సమయంలో అభ్యర్థులు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, ఏవైనా సమస్యలు లేదా ఇబ్బందులు ఎదురైతే నేరుగా పోలీసులను సంప్రదించవచ్చని ఎస్పీ స్పష్టం చేశారు. ఫిర్యాదులపై పోలీసు శాఖ తక్షణమే స్పందించి, చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు.ప్రజలు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటిస్తూ, ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీసు శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

ప్రొద్దుటూరులో నామినేషన్ కేంద్రం పరిశీలన



ప్రొద్దుటూరుఅక్టోబర్24(నేటి మనదేశమ్ ప్రతినిధి) : కడప జిల్లా ప్రొద్దుటూరులో రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు జగన్నాథ్ సింగ్ పర్యటించారు. మండలంలోని 24 ఎంపీటీసీ స్థానాలకు మూడో రోజు అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియపై ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్వో కృష్ణమూర్తి, తహసీల్దార్ ఉదయ భాస్కర్ రాజుతో మాట్లాడి నామినేషన్ల నమోదు గురించి అడిగారు. పోలీసు అధికారులను పిలిపించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సజావుగా జరుగుతుందా లేదా అని అడిగారు.

జడ్పీటీసీ స్థానాలకు రెండోరోజు 54 దాఖలు

–నామినేషన్ కేంద్రం వద్ద ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రవీణ్‌తో

పెదకూరపాడు జడ్పీటీసీ అభ్యర్థిని కీర్తన

నరసరావుపేట అక్టోబర్24(నేటి మనదేశమ్ ప్రతినిధి) నరసరావుపేట జిల్లాలో జడ్పీటీసీ నామినేషన్ల ప్రక్రియ వేగం పుంజుకుంది. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్లకు భద్రత కట్టుదిట్టంగా చేపట్టాలని ఎన్నికల కమిషనర్ కలెక్టర్లను ఆదేశించారు. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం భద్రతను మరింత పెంచింది. రాజకీయ పార్టీల అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు ఆర్డీవో కార్యాలయానికి వచ్చే మార్గాన్ని మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి గడియారం స్తంభం వరకు మార్చారు. తద్వారా మూడంచెల భద్రతను దాటి అభ్యర్థులు రావాల్సి ఉంటుంది. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రిటర్నింగ్ అధికారి జేసీ సంజనా శ్రీహర్ష అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించారు. అభ్యర్థుల వెంట ఎక్కువ మందిని రావడాన్ని పోలీసులు తిరస్కరించారు. అభ్యర్థితో పాటు ప్రతిపాదకుడు, మరో ఇద్దరు సాక్షుల్ని మాత్రమే అనుమతించారు.

అదనపు ఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. జడ్పీటీసీ నామినేషన్ల ప్రక్రియలో రెండో రోజు మొత్తం 54 నామినేషన్లు దాఖలు చేసినట్లు అధికారులు తెలిపారు. తెదేపా 38, వైకాపా 10, సీపీఎం 4, స్వతంత్ర అభ్యర్థులు 2 నామినేషన్లు వేశారు. కోలాహలం .. వివిధ పార్టీల అభ్యర్థులతో నామినేషన్ల కేంద్రం ఎదుట కోలాహలం నెలకొంది. పెదకూరపాడు నుంచి తెదేపా అభ్యర్థి నల్లపాటి కీర్తన నామినేషన్ దాఖలు చేశారు. ఆమెకు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, నరసరావుపేట ఎమ్మెల్యే అరవిందబాబు, ఎమ్మెల్సీ రాజశేఖర్ మద్దతు పలికారు. తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లపాటి రామచంద్ర ప్రసాద్ వెంట ఉన్నారు. పిడుగురాళ్ల జడ్పీటీసీ స్థానానికి ఉన్నం దీపిక నామినేషన్ వేశారు. శావల్యాపురం జడ్పీటీసీకి అమర్తపూడి విశ్రాంతమ్మ, క్రోసూరుకు చిలకా నాగేశ్వరరావు, దుర్గికి బృంగ నాగజ్యోతి, బెల్లంకొండకు ఎన్.జ్యోతి బాయ్, ఈపూరుకు పులుకూరు రజని, సత్తెనపల్లికి కట్టా రమేష్, బొల్లాపల్లికి రమేష్, మాచర్లకు గండాల శ్రీనివాసరావు, రాజుపాలెం నుంచి పెద్దిరాజు తెదేపా అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు. జిల్లాలోని 419 ఎంపీటీసీ స్థానాలకు గురువారం ఆయా మండల కేంద్రాల్లో నామినేషన్ల ప్రక్రియ కోలాహలంగా సాగింది. రెండో రోజు 625 నామినేషన్లు దాఖలైనట్లు జిల్లా అదనపు ఎన్నికల అధికారి, జడ్పీ సీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు. తెదేపా అభ్యర్థులు 498, వైకాపా – 64, జనసేన – 47, భాజపా – 3, స్వతంత్ర అభ్యర్థులు 13 మంది నామపత్రాల్ని సమర్పించారన్నారు. బుధ, గురువారాల్లో కలిపి మొత్తం 768 నామినేషన్లు దాఖలయ్యాయన్నారు.

ఫారం జి

బ్లాక్‌బర్న్ ఫ్యూయల్స్ (ప్రైవేట్ లిమిటెడ్ కోసం ఆసక్తి వ్యక్తీకరణకు ఆహ్వానం

(భారత దివాలా మరియు బ్యాంక్రప్సీ బోర్డు (కార్పొరేట్ వ్యక్తుల కోసం దివాలా పరిష్కార (ప్రక్రియ) నిబంధనలు, 2016లోని నిబంధన 36A యొక్క ఉప-నిబంధన (1) (ప్రకారం)

	సంబంధిత వివరాలు	
1	కార్పొరేట్ రుణగ్రహీత పేరు, పాన్ & సిఐఎన్/ ఎల్ఎల్పి నంబర్‌తో పాటు.	బ్లాక్‌బర్న్ ఫ్యూయల్స్ (ప్రైవేట్ లిమిటెడ్ PAN: AADCM5940P CIN: U68200AP1992PTC013774
2	నమోదిత కార్యాలయ చిరునామా	ఇంటి నం. 1-81, గణపతి నివాస్ శ్రీనివాస నగర్, NCS రోడ్, విజయనగరం, ఆంధ్రప్రదేశ్, భారతదేశం - 535001
3	వెబ్‌సైట్ యొక్క URL	అందుబాటులో లేదు
4	అధికశాతం స్థిరాస్తులు ఉన్న ప్రదేశం యొక్క వివరాలు	అందుబాటులో లేదు
5	ప్రధాన ఉత్పత్తులు/సేవల స్థాపిత సామర్థ్యం	అందుబాటులో లేదు
6	గత ఆర్థిక సంవత్సరంలో విక్రయించిన ప్రధాన ఉత్పత్తులు/సేవల పరిమాణం మరియు విలువ	గత ఆర్థిక నివేదిక FY 2024-2025 (ప్రకారం- శూన్యం
7	ఉద్యోగులు/ కార్మికుల సంఖ్య	అందుబాటులో లేదు
8	గత రెండు సంవత్సరాల చివరిగా అందుబాటులో ఉన్న ఆర్థిక నివేదికలు (షెడ్యూళ్లతో సహా), రుణదాతల జాబితాలతో సహా మరిన్ని వివరాలు	మరిన్ని వివరాలు bfpl.cirp26@gmail.com అనే ఈ-మెయిల్‌లోని వివరణాత్మక EOIలో అందుబాటులో ఉన్నాయి.
9	కోడ్ యొక్క సెక్షన్ 25(2)(H) కింద తీర్మాన దరఖాస్తుదారుల అర్హత ఈ URLలో అందుబాటులో ఉంది: WWW.TRUUEIPE.COM	మరిన్ని వివరాలు bfpl.cirp26@gmail.com అనే ఈ-మెయిల్‌లోని వివరణాత్మక EOIలో అందుబాటులో ఉన్నాయి.
10.	ఆసక్తి వ్యక్తీకరణ స్వీకరణకు చివరి తేదీ	అసలు - 12 సెప్టెంబర్ 2026 సవరించినది - 9 నవంబర్ 2026
11.	సంభావ్య తీర్మాన దరఖాస్తుదారుల తాత్కాలిక జాబితా జారీ తేదీ	అసలు 16 సెప్టెంబర్ 2026 సవరించినది - 13 నవంబర్ 2026
12.	తాత్కాలిక జాబితాకు అభ్యంతరాలు సమర్పించడానికి చివరి తేదీ	అసలు - 21 సెప్టెంబర్ 2026 సవరించినది - 18 నవంబర్ 2026
13.	సంభావ్య తీర్మాన దరఖాస్తుదారుల తుది జాబితా జారీ తేదీ	అసలు - 25 సెప్టెంబర్ 2026 సవరించినది - 21 నవంబర్ 2026
14.	సంభావ్య పరిష్కార దరఖాస్తుదారులకు సమాచార మెమోరాండం, మూల్యాంకన మ్యాట్రిక్స్ మరియు పరిష్కార ప్రణాళికల కోసం అభ్యర్థనను జారీ చేసిన తేదీ	అసలు - 30 సెప్టెంబర్ 2026 సవరించినది - 26 నవంబర్ 2026
15.	తీర్మాన ప్రణాళికలను సమర్పించడానికి చివరి తేదీ	అసలు - 30 అక్టోబర్ 2026 సవరించినది - 26 డిసెంబర్ 2026
16.	ఆసక్తి వ్యక్తీకరణను సమర్పించడానికి ఈ ఇమెయిల్ ఐడిని నమోదు చేయండి	bfpl.cirp26@gmail.com
17.	MSMEగా కార్పొరేట్ రుణగ్రహీత యొక్క రిజిస్ట్రేషన్ స్థితి వివరాలు)	వర్తించదు

ఐపి మైలవరపు సుజాత
మెస్సర్స్. బ్లాక్‌బర్న్ ఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారి రిజల్యూషన్ ప్రొఫెషనల్
రిజిస్ట్రేషన్ నెం. IBBI/IPA-003/00434/2023-2024/14286

తేదీ: 25.10.2026
స్థలం: విశాఖపట్నం